భారత యువకుల భవితవ్యం

# ★ దొరకని ముక్తిమార్గం ★

కాలజ్ఞానం సుబ్బారావు

రామారావుకి బుర్రలో తేళ్ళూ జెర్రులూ ప్రాకినట్లయింది. చదివేప్పుడు తాననుకున్నదంతా జరగలేదు సరికదా జీవితం గడపడం దుర్లభంగా తోచింది. వైరాగ్యం పొందడం దేనికో తనకిప్పుడు గ్రాహ్యమైంది. చదువు ముగించినదే తడవుగా తను డిగ్రీ పొందిన దానికి మంచి హోదాగల ఉద్యోగం ప్రభుత్వం పిలిచి యిస్తుందని అనుకునేవాడు. తన ఆశలన్నీ అడియాసలైనాయి. ఇంట్లో నాయనకి వచ్చే ఫించను డబ్బులు అందరికీ అరకడుపు నిండడానికైనా చాలడం లేదు. యూనివర్సిటీ ఫస్టు కొట్టినా విధిబలమో లేక ఇంకేం రాతో గాని రామారావు ఎన్ని ఉద్యోగాలకి ధరఖాస్తులు పెట్టుకున్నా ఒక్కదానికైనా జవాబు రాలేదు. వీటిమీదే దాదాపు ఓయాభై రూపాయలు ఖర్చయివుంటుంది. చివరకి 'ఇంటర్వ్యూ'కి కూడా కార్డు వచ్చేదికాదు. టెస్టిమోనియల్స్‌కి లెక్కలా! అందులో తన ప్రిన్సిపాల్, లెక్చరర్లూ తన్నెంత గాఢంగా ప్రశంసించారు? ఐనా రాకపోవడం దేనికి? అర్థం కాలేదు పాపం. రామారావు తెలివితేటలు కలిగివున్నా త్వరలో రౌద్రాకారం పొందే బలహీనం అతనిలో వుంది. ఇంట్లో తన చెల్లెలు ఎదిగింది. పెండ్లి చెయ్యాల్సిన బాధ్యత తనమీద పడింది. నాయనేమో ముసలివాడయ్యాడు. తన చదువుకి అయిన అప్పులింకా తీరలేదు! వాళ్ళంతా ఎదురుపడ్డప్పుడల్లా నాయన్ని నిలదీసి అడగడం రామారావుకి కష్టంగా వుంది. కాని తానో - నిస్సహాయుడు - నిరుద్యోగి. తనేం ఉద్యోగం చెయ్యనన్నాడా! అతగాన్ననడానికి నోరురాదు. చదివేప్పుడు, ఉద్యోగం చేసే మొదటనెల జీతంతో అమ్మకి ఓపట్టు చీర-చెల్లెలికి మంచి వాయిల్సు చీరలు-నాన్నకి మిల్లు ధోవతులు ఓ జత కొనివ్వాలని అనుకున్న తన తలంపులన్నీ వ్యర్థమైనాయి. అవి తలచుకుంటే నిజంగా రాతిగుండె గలవాడైనా, రామారావుకి కళ్ళలో నీళ్ళు తిరిగేవి.

పక్కింటి ప్రభాకర్‌కి, స్కూల్ ఫైనల్లో మూడుసార్లు 'గోల్' కొట్టినా డబ్బుంది కాబట్టి సెంట్రల్ బ్యాంకులో ఆ వూళ్ళోనే గుమాస్తాగిరీ దొరికింది. అది లేకున్నా వాడికి తిండికి లోటు లేదు. తనకంటేనా ఆ గుమాస్తాగిరే ఎంతో సాయపడ్తుంది. ఇంతకూ తను ఒక డిగ్రీ కూడా పొందాడు. బంగారు పతకం విశ్వవిద్యాలయం బహుమానంగా యిచ్చింది. దాన్ని చూస్తూ కూర్చుంటే కడుపులు నిండుతాయా? రామారావుకి చదువుమీద కోపం వచ్చింది. తను చదివి సాధించిందేమిటి? ఆవయస్సులో నాయనపై యింకా ఆధారపడడమేగా! చదవకుండా వుండివుంటే అప్పులు లేకుండా వుండేవి. గతాన్ని విస్మరిస్తే కలిగే లాభమేమిటి? అడుసుత్రొక్కిన తర్వాత కాలు కడిగితీరాలి... లేకుంటే... అనుభవించాలి మరి.

రామారావు పిచ్చివాడి మోస్తరు తిరుగుతుండేవాడు. కాలేజీరోజుల్లోని ఆ ఉత్సాహం, ఆ వేషం, ఆ మాటలు మాయమైనాయి. ఎవరైనా పలకరించినా తనను కాదనేట్టుగా ఉండేవాడు. కాలేజీలో చదివేప్పుడు తెల్లారి కాఫీ లేకుంటే ఒక్కరోజు తనకు గడిచేదా? ఇప్పుడో!...మంచినీళ్ళే ప్రాప్తి! అన్నీ సర్దుకొని పోవాల్సివచ్చింది. గతం తలచేకొద్దీ రామారావ్‌కి ఏడుపు పొంగి పొర్లివచ్చేది. 'గతం గతం'గా వుండనిస్తామన్నా తన చేతకాకుండా పోయింది. అందుకే మనస్సులో వదలని తీవ్ర వేదన... రోజూ తపాలాఫీసుకి తెల్లారి వెళ్ళేవాడు గంపెడాశతో. ఆ పోస్టుమ్యాను 'ఊహూఁ' అని తలవూపడంతో దెబ్బతిన్న పావురంలా రక్తంలేని మొహంతో వెనక్కి మళ్ళే

వాడు. ఉద్యోగాలకి దరఖాస్తులకే ఎంతో ఖర్చైంది......ఓనాడు అనుకోకుండా ఒక 'ఇంటర్వ్యూ కార్డు' వచ్చింది. రామారావు పేరనే! అందులో రైల్వే డిపార్టుమెంటు. నాయనకి చెప్పాడు. ఇంతకూ దానికి వుండే షరతులు చూస్తే అది ప్రాప్తమయ్యేట్టు లేదు! జీకమూ అన్నీ అలవెన్సులూ చేరి నూటికొస్తాయి, టెంపొరరీను! ఎక్కడంటే అక్కడికి పోస్టు చెయ్యొచ్చు. కానీ రామారావుకి అది బావిలో పడ్డవానికి గడ్డిపోచలాగా ఆధారం దొరికింది. తన స్నేహితుడి కాళ్లుపట్టుకుని డబ్బు అప్పు తెచ్చాడు. ఉండే ధోవతుల్ని రెంటిని ఉతుక్కొని బయల్దేరాడు మర్నాడే మద్రాసుకి. ఆ ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వచ్చినవాళ్ళని చూసేప్పటికి రామారావుకి ముందరి ఉత్సాహం సన్నగిల్లింది. మళ్ళీ సముదాయించుకొని తెప్పరిల్లాడు. తన వంతు వచ్చేప్పటికి లోపలికెళ్ళాడు. పేరడిగి పంపించారు. ఏమేమో అడిగితే ధీమాగా జవాబులిచ్చి ఉద్యోగం తప్పక పొందాలనే రామారావ్ వాంఛలు మట్టిపాలయినై! ఏదో ఆశ లవలేశం కొనవూపిరితో కొట్టుకులాడసాగింది లోపల్నే. తన 'క్లాస్' సాయం చేస్తుందనే పిచ్చినమ్మకమింకా మిగిలింది. అదీ వారంరోజులకే మంచుగడ్డలా కరిగిపోయింది. తన్ని సెలెక్టు చెయ్యలేదని రిగ్రెట్ కార్డు రావడంతో ఆశ అణగారింది. తర్వాత ఆ ఉద్యోగాలకి ఖాతాదారులప్పుడే వున్నారనీ కండ్లుకప్పేందుకు ఇన్ని హడావుళ్లు జరిగాయనీ తెలిసాయి. రామారావ్ ఉడుకురక్తం పొంగింది. పెనుగాలి వీచింది బుర్రలో. పండ్లు పటపట కొరికాడు. కాని ఓరిమి (గాడిదల సుగుణం!) చిక్కబట్టుకోవాల్సి వచ్చింది. లేకుంటే ఏ డెంటిస్టు దగ్గరికో వెళ్ళాల్సివస్తుంది. రామారావ్‌తో చదువుతూ రెండు భాగాల్లో తప్పిన ఓ అబ్బాయికి ఆ ఉద్యోగం వచ్చింది. మరి వాళ్ల నాన్నకి పెద్దతలకాయలు ప్రాణస్నేహితులైతే ఉద్యోగం డాక్టరుని వెదుక్కోవాలి. ...ఫస్టు క్లాసులో పాసయ్యాడే అంటే?...ఊఁ!! అదీ మగ్ చేసి అంతేగా!...ఇదీ లోకం పోకడ...

రామారావ్‌కి వేదాంతమే శరణ్యమయింది. ఈమాదిరి ప్రతీసారి విఫలుడవటంతో! ఇంకో కారణం కూడా...ఇంటర్వ్యూది ఓగాథ! అసలు యింటర్వ్యూకి రానివాడు సెలెక్ట్ అయ్యాడు. ఇది మరీ విచిత్రం! వచ్చినట్టు కాగితాల్లోవుంది. ఈ నాటకం తెలియడంతో రామారావు అమాంతంగా ఆగ్రహం పొందాడు. ఎవరిమీద వెళ్ళకక్కడం? కాబట్టే ఊరుకున్నాడు. అతగాడికి దేశంమీది భక్తి, నాయకులమీది గౌరవం, బ్రతుకుమీది వ్యామోహం ఒక్కసారిగా నశించాయి...మార్గం మార్చినాడు. సరాసరిన మైలు దూరంలో వుండే స్వామీ నిశ్చింతుల (సర్వసంగ పరిత్యాగం చెయ్యబట్టి చింతలేనివారయ్యారుగాబోలు!) వారి దగ్గరికి గబగబా అంగలేస్తూ బయల్దేరాడు. ఏకాఏకిన స్వామివారి పాదాలమీద పడి 'మార్గం' చూపించండన్నాడు. 'దేనికి బాబూ!' అని నిశ్చింతులవారు మందస్మిత వదనంతో అడిగారు. 'సుఖం పొందడానికి స్వామీ! సుఖం అంటే నిర్వచనం చెప్తారా?' అన్నాడు. స్వాములవారు కాస్తంతసేపు కండ్లు మూసికొని తర్వాత 'దుఃఖంలేనిది నాయనా' అని పరమార్థం గ్రహించినట్టు చెప్పారు. రామారావ్ ఉలిక్కిపడ్డాడు. మళ్ళీ సావకాశంగా స్వాములవార్ని గమనించాడు. వారి ఆనందమయమైన ముఖం, పీతాంబరాలు (కాషాయరంగువి!) చేతిలోని బంగారు కడియాలు, ఆశ్రమంలో సుగంధ ద్రవ్యాల వాసన, పళ్లెరాల్లో పండ్లు, గ్లాసుల్లో పాలు అన్నీ ఒకటివెంబడి ఒకటి అవలోకించాడు. ఉన్నట్టుండి లేచాడు! తన న్వేషించింది దొరికేట్టు లేకపోగా వేదాంతంమీది నమ్మకం వేళ్ళతో సహా పెల్లగించుకొని పోయింది రామారావ్ బుర్రలోంచి. స్వాములవారికి టాటా,